శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్ నగర్ , మార్చి22: రాష్ట్రంలోని శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేంపావని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శ్రామిక మహిళలకు కార్మిక చట్టాలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజు రోజుకు పనిభారం పెంచుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సైతం శ్రామిక మహిళలకు తగిన నిధులు కేటాయింపులు జరుగలేదని విమర్శించారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటాలని పిలుపు నిచ్చారు.

ఏఐవైఎఫ్ నేతలను బేషరతుగా విడుదల చేయాలి

హిమాయత్‌నగర్ : రాష్ట్ర వ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎటువంటి ముట్టడి కార్యక్రమాలకు పిలుపు ఇవ్వక పోయినప్పటికీ పోలీసులు అన్ని జిల్లాల్లో ఉన్న ఏఐవైఎఫ్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ అక్రమ అరెస్ట్‌లపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం నీరుగార్చేలా పోలీస్ అధికారుల పోకడలు ఉన్నాయని ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రాజ్యాంగం ప్రసాదించిన పోరాట హక్కులను సైతం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అక్రమ అరెస్టులు,అణచివేత ధోరణిని కట్టడి చేయవచ్చునే దృక్పథంను ప్రభుత్వం మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

అడ్డగుట్ట, మార్చి 22 : అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్ నగర్ లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం అమలుపై చర్చించారు. అనంతరం ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సరిపడా మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, సీపీఐ నేత కాంపల్లి శ్రీనివాస్ కొమురయ్య, లక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో పొరపాట్లు లేకుండా చూడాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్, మార్చి 22 : పది పరీక్షలకు ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులు సూచించారు. శనివారం శంషాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

- ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించడంతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు.
- పరీక్షా హాల్‌లో నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు ఫ్యాన్లు తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.
- వేసవి దృష్ట్యా విద్యార్థులు అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యసేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.
- పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు అనుమతించరాదన్నారు. ఎలాంటి

శంషాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

మాల్‌ప్రాక్టీస్‌కి అవకాశం లేకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.కలెక్టర్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్,ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓవర్ ఫ్లో, లీకేజీల సమస్యలు లేకుండా చూడాలి

అభివృద్ధి పనుల కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఎమ్మెల్యే కాలనీలో సీవరేజీలైన్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, మార్చి 22: నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్ డివిజన్ ఎమ్మెల్యే కాలనీలో రూ. 1.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. రూ. 1.21 కోట్ల వ్యయంతో మురుగు నీటి ఒమేగా ఆస్పత్రి సమీపంలో సివరేజ్ పైప్ లైన్ నిర్మాణం, రూ. 22 లక్షలతో జీహెచ్ఎంసీ పార్కు నుంచి రోడ్డు12 వరకు ప్రధాన సీవరేజ్ పైప్‌లైన్ ఏర్పాటు, రూ. 28 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ ప్లాట్ నంబర్ 11 బీ నుంచి 2బీ వరకు 300 ఎం.ఎం సీవరేజ్ లైన్ పనులను ప్రారంభించామని మేయర్ తెలిపారు.ఓవర్ ఫ్లో, లీకేజీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీ.ఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు, జీహెచ్ ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పోస్టల్ యాక్ట్ ను రద్దు చేయాలి

హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ తదితరులు

హిమాయత్ నగర్ , మార్చి 22: ప్రైవేట్ కొరియర్ సర్వీసులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక పోస్టల్ యాక్ట్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల,కార్మిక కాన్ఫడరేషన్ ఉపాధ్యక్షుడు పి. సురేష్ డిమాండ్ చేశారు. పోస్టల్ శాఖ ప్రైవేటీకరణ– పోస్టల్ యాక్ట్ రద్దు –ఉద్యోగుల ప్రాథమిక హక్కులు అనే అంశంపై శనివారం హిమాయత్ నగర్ లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలోకి పోస్టల్ సర్వీసులు తరలిపోతే సామాన్య ప్రజలకు పోస్టల్ సేవలు ఖరీదుగా మారిపోయే అవకాశం ఉందన్నారు. పోస్టల్ యాక్టును రద్దు చేసేంతవరకు ఉద్యోగులు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.

ఈ సమావేశంలో ఏఐటీయూసీ సీనియర్ నేత వి.ఎస్.బోస్, అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. జలా వుద్దీన్, నేత లు నర్సింలు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మణికొండలో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న స్థానిక నాయకులు

మణికొండ, మార్చి 22 : మణికొండ మున్సిపాలిటీ నెమలినగర్ కాలనీకి చెందిన బ్రమ్మయ్యచారి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స చేయించుకున్నాడు. అందుకుగాను బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 34వేల చెక్కు మంజూరు కావడంతో శనివారం నార్సింగి మార్కెట్ కమిటీ డైరక్టర్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ , కౌన్సిలర్స్ కొంగండ లక్ష్మీనారాయణ , పురుషోత్తం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోళ్లు శ్రీరాములు , మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్ , శ్రవణ్ నాయకులు విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

విధుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవు

నీడీపీఓ అనిత

వ్యవసాయ యూనివర్సిటీ, హైదరాబాద్ మార్చి 22: విధుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని ఐసీడీఎస్ రాజేంద్రనగర్ సీడీపీఓ అనిత అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికలు, మహిళలకు కేటాయించిన పౌష్టికాహారం సకాలంలో ఇవ్వాలని ఎక్కడైనా విధులకు సైతం జాప్యం జరిగితే సహించేది లేదని ఆమె హెచ్చరించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

చిన్ననాటి నుంచే భవిష్యత్ కోసం ప్రతి విద్యార్థి ప్రణాళికలను రూపొందించుకుని విద్యను అభ్యసించాలని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ వైస్ ఛైర్మన్ మణికొండ ప్రార్థన సూచించారు. శనివారం హిమాయత్ నగర్ ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఆవరణలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణ వంటి లక్షణాలను అలవార్చుకోవాలన్నారు.రంగు రంగుల దుస్తులు ధరించిన చిన్నారులు సంగీతం, నృత్యాలు అందరిని అలరించారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, ప్రిన్సిపాల్ ఫాతిమా ఖాజిమ్ తదితరులు పాల్గొన్నారు.

–హిమాయత్ నగర్ , మార్చి22:

కుమ్మరులు అన్ని రంగాల్లో ఎదగాలి

త్వరలో లక్ష మందితో బహిరంగ సభ

శాలివాహన చక్రవర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పూర్ణచందర్ రావు, సూర్యారావు, డాక్టర్ రవిశంకర్, సత్యం తదితరులు

ఖైరతాబాద్, మార్చి 22 : కుమ్మరులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ జె. పూర్ణచందర్ రావు పిలుపునిచ్చారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కుమ్మర శాలివాహన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీస మాజ్ అధ్యక్షులు, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రవిశంకర్, కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు సంగెం సూర్యారావు, కోశాధికారి నిమ్మలూరు శ్రీనివాస్ రావు, గౌరవ అధ్యక్షులు కె. దశరథరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్ణచందర్ రావు మాట్లాడుతూ శాలివాహనచక్రవర్తి స్ఫూర్తితో కుమ్మరులు రాజకీయంగా ఎదిగినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. త్వరలో లక్ష మంది కుమ్మరులతో బహిరంగ సభను నిర్వహిస్తానారు. ఈ కార్యక్రమంలో నగేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, ఆకారపు మల్లేశం, రేపాక రాం బాబూ, కంభంపాటి సత్యనారాయణ, సిలివేరు వెంకటేశ్, శంకర్, మల్లికార్జున్, నర్సింహ పాల్గొన్నారు.

నేడు మణికొండలో మల్లన్న కల్యాణోత్సవం

హోమం నిర్వహిస్తున్న కురుమ సంఘం ప్రతినిధులు

మణికొండ, మార్చి 22 : మణికొండ మున్సిపాలిటీలో నేడు కురుమ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న జాతర కళ్యాణోత్సవ కార్యక్రమాలతో పాటు బీరప్ప స్వామి దేవాలయ సదనం ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం హోమగుండం వద్ద పూజలను ప్రారంభించారు. (నేడు) ఆదివారం తెల్లవారుజాము నుంచి ఒగ్గు రాజుల మంత్రోచ్చరణలతో ప్రారంభమై మల్లన్న స్వామి కళ్యాణోత్సవం ఉదయం 11 గంటల 13 నిమిషాలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం బీరప్ప స్వామి దేవాలయం ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, ప్రకాశ్‌గౌడ్, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షుడు క్యామ మల్లేష్ కురుమ, గుడిమల్కాపూర్ చైర్మన్ మల్లేష్ నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు కుమార్ గౌడ్ లతోపాటు స్థానిక నాయకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం, నైతిక విలువలు పాటించాలి

విద్యార్థులు నైపుణ్యం, నైతిక విలువలు పాటించడం ద్వారా తమ లక్ష్యాలను సులభంగా సాధించగలరని మహవీర్ గ్రూప్ కళాశాలల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. –మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 22:

ఎన్నికల హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

ఉడెంగడ్డ చౌరస్తాలో నిరసన చేపడుతున్న సీఐటీయూ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 22: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయడంతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఉడెంగడ్డ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. అనేక రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాల సవరణ, ఇన్సూరెన్స్‌లు అందించాలన్నారు. కార్మికుల పక్షాన ముందుండి పోరాడుతున్న సీఐటీయూపై కక్షసాధింపుతో రాష్ట్రంలోని నాయకులపై కేసులు పెట్టించి అరెస్టులు చేయిస్తున్నారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులను మానుకోవాలని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.బాలరాజ్‌గౌడ్, నర్సింహ, అన్వర్, రిజ్వాన్, తిరుపతయ్య, చంద్రయ్య తదితరులున్నారు.

సామాజిక బాధ్యతగా...

పోలీసు విధులతో పాటు తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వరిస్తున్నారు. శనివారం ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై కారం పొడి ప్యాకెటు పడి పగిలిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ రోడ్డుపై పడిపోయిన కారంపొడిని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

– ఖైరతాబాద్, మార్చి 22

నీటి వనరులు పెరిగేందుకు కృషి చేయాలి

ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, హైదరాబాద్ మార్చి 22: దేశంలో నీటి వనరులు పెంచుకునేందుకు వాటర్ షెడ్‌ను ఉపయోగించుకోవాలని, అందుకు అనుగుణంగా శాస్త్రవేత్తలు, ప్రజలు మరింత కృషి చేయాలని మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గల ఎక్స్‌స్టన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన సింపోజిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంచెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల సింపోసియం వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో నీటి వనరులు రోజురోజుకు తగ్గిపోతున్నాయని ,అందుకు ప్రత్యామ్నాయంగా వాటర్ షెడ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. జాతీయస్థాయిలో భారత్ ప్రధాని తగు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం మహారాష్ట్రకు చెందిన శాస్త్రవేత్త విజయ్ దేవరాజ్ పాల్గొని మహారాష్ట్రలో 2016లో నీటి సంక్షోభం ఏర్పడ్డప్పటికీ అక్కడ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని ఆయన సూచించారు. ప్రస్తుతం దేశంలో న్యూ జనరేషన్ వాటర్ సెట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ 2021 పీఎంకెఎస్‌వై పథకంను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

ప్రయాణికుడిలా నటించి.. పర్సు చోరీ

దొంగతో కలిసి ఆటోతో సహా డ్రైవర్ పరార్

మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

వెంగళరావునగర్, మార్చి 22 : ప్రయాణికుడిలా నటిస్తూ తోటి ప్రయాణికుడి పర్సు లాక్కున్నాడో దొంగ. ప్రయాణికులను దింపి దొంగతో కలిసి ఆటో డ్రైవర్ పరారైన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని అమీర్ పేట్ మైత్రీ వనం వద్ద చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుమిత్ కుమార్ పాండే (26) జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వద్ద ఉన్న హోటల్లో తన భార్యతో కలిసి రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 20న రాత్రి విధులు ముగించుకుని తన భార్యతో కలిసి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి అమీర్‌పేట్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. అప్పటికే ఆ ఆటోలో వెనుక సీటులో ఓ వ్యక్తి ఉన్నాడు. అమీర్‌పేట్ మైత్రీవనం పెట్రోల్ బంక్ వద్ద దంపతులు ఆటో దిగారు. ఆన్‌లైన్ పేమెంట్ చేస్తానని సుమిత్ కుమార్ చెప్పగా.. క్యాష్ మాత్రమే ఇవ్వాలని ఆటో డ్రైవర్ కోరాడు. దాంతో జేబులో నుంచి పర్సులో నుంచి రూ.500 ఇవ్వబోగా..ఆటో వెనుక సీట్లో ఉన్న వ్యక్తి పర్సు లాక్కున్నాడు. ఆ వెంటనే ఆటోని వేగంగా ముందుకు నడిపి ఆటోతో సహా దొంగతో కలిసి డ్రైవర్ పరారయ్యాడు.

బాధితుడు సుమిత్ కుమార్ పాండే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిసరాలోని సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించి.. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'వన్ టైమ్ సెటిల్‌మెంట్'ను సద్వినియోగంచేసుకోవాలి

డీసీ జాకియా సుల్తానా • ఓటీఎస్‌లో రూ.54 లక్షల రాయితీ

డీసీ జాకియా సుల్తానాకు రూ.40 లక్షల చెక్కును అందజేస్తున్న వాణిజ్య సంస్థ యజమాని

జూబ్లీహిల్స్,మార్చి 22: జీహెచ్ఎంసీ అందిస్తున్న ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకున్న ఓ వాణిజ్య సంస్థ యజమాని పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను ఒకేసారి చెల్లించి ఏకంగా రూ.54 లక్షల రాయితీ పొందాడు. యూసుఫ్‌గూడ సర్కిల్ లోని ఒక వాణిజ్య సంస్థ రూ.94 లక్షల ఆస్తిపన్ను చెల్లించాల్సి వుంది. గత 14 సంవత్సరాల నుంచి కోర్టు కేసులో వున్న సదరు సంస్థ ప్రాపర్టీ బల్దియా ఆధీనంలో వుంది. అయితే ప్రతి శనివారం నిర్వహించే ఆస్తిపన్ను పరిష్కార వేదికలో వివాదాన్ని పరిష్కరించిన సర్కిల్ 19 అధికారులు ఎట్టకేలకు భారీ మొత్తంలో పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను వసూలు చేశారు. దీంతో ఒకేసారి ఆస్తిపన్ను చెల్లించిన సదరు వాణిజ్య సంస్థ యజమానికి రూ.54 లక్షల రాయితీ లభించింది.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను ఒకేసారి చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలని.. మార్చి నెలాఖరు వరకు మాత్రమే వున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీ హెచ్ఎం సీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా కోరారు. శనివారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఒక వాణిజ్య సంస్థ యజమాని నుంచి రూ. 40 లక్షల చెక్కును ఏ ఎం సీ కమల్, ఇన్చార్జి ఏ ఎం సీ బాల్ రాజ్‌లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా డీ సీ మాట్లాడుతూ.. ఆస్తిపన్ను గడువు లోపు చెల్లించకుంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలోచనలు,పరిశోధనలకు హద్దులు లేవు

శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొ. కె. వీరారెడ్డి

బంజారాహిల్స్, మార్చి 22 : ప్రజల ధృక్కోణంలో, సామాన్యులకు ఉపయోగపడేలా పరిశోధనలు చేయడంలో, ప్రజల సంక్షేమం కోసం ఆలోచనలు చేయడానికి ఎలాంటి హద్దులు లేవని శాతవాహన విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య. కె. వీరారెడ్డి పేర్కొన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సైన్స్ విభాగం ఆధ్వర్యంలో హద్దులు లేని సైన్స్, భవిష్యత్తు కోసం బహుళ విభాగ దృష్టి' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమానికి శాతవాహన విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొ.కె.వీరారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య. కె.వీరారెడ్డి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల నుంచి సైన్స్ బాగా అభివృద్ధి చెందుతోందని, ఇది సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తోందని పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ ప్రాంతానికి, వ్యవసాయ అభివృద్ధికి ఉపయోగపడాలని అప్పుడే నిజమైన సాంకేతిక అభివృద్ధి అని పేర్కొన్నారు. యువ పరిశోధకులు చేసే పరిశోధనలు సామాన్యులకు ఉపయోగపడినప్పుడే నిజమైన అభివృద్ధి అని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.యల్. విజయ క్రిష్ణారెడ్డి, డా.ఎ. రామచంద్రయ్య, అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. జి.పుష్పా చక్రపాణి, డా. కె. శ్రీదేవి, డా. ప్రమీలా కేతావత్, డా. కోటేశ్వరరావు, డా. ఎం. కిశోర్, డా. వై. కుమార్; డా. విజయ్ కుమార్, డా. రామకృష్ణ, డా. ఉష శ్రీ, డా. రజిత, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా రంగంలో ఏఐ పాత్ర కీలకం

చిక్కడపల్లి, మార్చి 22: ఉన్నత విద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పాత్ర కీలక